క్లుప్తంగా

రైతుల ప్రయోజనం కోసమే నీటి విడుదల

శాలిగౌరారం: ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి నార్లు పోసుకునేందుకు అదును దాటిపోతుందనే ఉద్దేశంతో రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి మంగళవారం సాగునీటిని విడుదల చేశామని నీటిపారుదల శాఖ ఏఈ రాములు తెలిపారు. బుధవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదల చేసిన విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులు ప్రొటోకాల్ అంశాన్ని లేవనెత్తి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి సాగునీటి విడుదల చేశామన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం మాజీ సర్పంచ్ నాగిళ్ల యాదయ్య వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య విగ్రహానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, బొబ్బిలి సుధాకర్‌రెడ్డి, శీలా రాజయ్య, గుడిసె లక్ష్మీనారాయణ, ఐతరాజు యాదయ్య, పాలమాకుల అర్జున్, చొప్పరి లింగయ్య, వెంకట్‌రెడ్డి, కిరణ్, లచ్చయ్య, సుగుణమ్మ, రేణుక పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

మునుగోడు: అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు చందాలు వేసుకుని రూ. 20 వేల నగదును అందజేసి మానవత్వం చాటుకున్నారు మునుగోడుకు చెందిన పలువురు యువకులు. మండలంలోని రావిగూడెం గ్రామానికి చెందిన రూపని వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ విషయం తెలుసుకున్న ఆయనతోపాటు పదో తరగతి చదివిన స్నేహితులు రూ. 20,166 పోగుచేసి బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో జరిగిన ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన విధంగా అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐలు సమక్రంగా చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, ఎండీ. సయ్యద్, కేఎస్ రెడ్డి, నూనె వెంకటేశ్వర్లు, దోటి వెంకన్న, వెంకటరావు, వెంకటేశ్వర్లు, లెనిన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ

నాంపల్లి: మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన పసుపుల చిలకయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. బుధవారం చిలకయ్యను నాంపల్లి జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. పానగంటి వెంకన్న గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము భిక్షం, చిట్టంపహాడ్ సర్పంచ్ అబ్బనబోయిన చందుయాదవ్, బక్క అమరేందర్, శ్రీను తదితరులు ఉన్నారు.

పోలింగ్ స్టేషన్ల వివరాలు సేకరించాలి

దేవరకొండ: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటులో అధికారులు పూర్తిస్థాయి వివరాలు సేకరించాలని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు అధికారులకు సూచించారు. బుధవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17వ తేదీలోగా పోలింగ్ స్టేషన్ల మార్పులు, చేర్పులకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2కిలో మీటర్ల కంటే ఎక్కువ దూరం లేకుండా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో ప్రాంతంలో రెండు పోలింగ్ స్టేషన్లు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తుది నివేదికను 18న కలెక్టర్‌కు అందించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు.

రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- శేషిలేటి వాగు ఫీడర్ చానల్‌కు నిధులు మంజూరవుతాయని అంచనా
- ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన రాజగోపాల్‌రెడ్డి



చండూరు మండలం కస్తాల గ్రామ పరిధిలో కాల్వ పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

చండూరు : ఏళ్లుగా ఎదురుచూస్తున్న శేషిలేటి వాగు ఫీడర్ చానల్ పనులకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రీన్ సిగ్నల్ లభిస్తుందని ఈ ప్రాంత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 13 ఏళ్లుగా నిలిచిపోయిన పనులను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్తవుతాయని ఈ ప్రాంత వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. శేషిలేటి వాగు, వెల్మకన్నె ఫీడర్ చానల్ పనులకు నిధులు మంజూరు చేయించి రైతులకు అండగా ఉంటానని ఎన్నికలకు ముందు రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు.

2010లో పనులు ప్రారంభం

నాంపల్లి మండలం జానీతండా నుంచి చండూరు మండలం కస్తాల మాధవరావు చెరువు 12 కిలోమీటర్ల వరకు ఫీడర్ ఛానల్ ద్వారా నీరు వచ్చేలా 2010వ సంవత్సరంలో పనులను ప్రారంభించారు. అప్పటి ప్రభుత్వం రూ.4 కోట్ల 50 లక్షల నిధులను విడుదల చేసింది. ఫీడర్ చానల్ పరిధిలో దేవరకొండ, నల్లగొండ రెవెన్యూ డివిజన్లు ఉండడంతో ఆ రెండు కార్యాలయాల సమన్వయ లోపంతో రైతులకు సమయానికి భూ పరిహారం ఇవ్వలేకపోయారు. మొదట్లో రైతులకు పరిహారం ఇవ్వకపోయినా పనులకు సహకరించారు. అప్పటికి 70 శాతంకు పైగా పనులు పూర్తయ్యాయి. సంబంధిత కాంట్రాక్టరుకు రూ.కోటి 20 లక్షలు బిల్లు అధికారులు చెల్లించారు. అయితే పరిహారంపై స్పందన లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో పనులు ముందుకు సాగలేదు. చేసిన 70 శాతం కాలువ, బ్రిడ్జీలు, చెక్ డ్యాంలు పూర్తిగా పూడిపోయాయి.

గతంలో రైతులతో ఒప్పందం

శేషిలేటి వాగు ఫీడర్ చానల్ పూర్తి చేయడానికి నాంపల్లి మండలం జానీతండా నుంచి కస్తాల గ్రామం వరకు 12 కిలోమీటర్ల మేర సుమారు 52 ఎకరాలు భూమి రైతులు కోల్పోవాల్సి వస్తుంది. ఎకరాకు ఆనాడు రూ.4లక్షల 50 వేలు నష్ట పరిహారం ఇచ్చేందుకు అధికారులు రైతుల నుంచి ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ నేడు భూముల ధరలు పెరగడంతో తమకు పరిహారం పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గతంలోనే 28 ఎకరాలకు పరిహారం మంజూరు కావడంతో పాటుగా టోకెన్స్ కూడా రైతులకు అందజేశారు. నగదు మాత్రం ఖాతాల్లో జమ చేయలేదు.

అధికారుల అలసత్వం..

అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఫలితంగా శేషిలేటి వాగు ఫీడర్ ఛానల్ పనులు ఓ అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కు అనే చందంగా సాగాయి. ఫీడర్ ఛానల్ పనులు పూర్తయితే బీడు భూములు సాగు చేసుకుందామనే రైతుల ఆశలు ఫలించ లేదు. పనులు పూర్తవుతాయని ఈ ప్రాంత రైతులు 13 ఏళ్లుగా ఎదురు చూడక తప్పలేదు. భూ పరిహారం ఇచ్చి పనులు చేయాలని రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అలిసిపోయారు. 13 ఏళ్ల క్రితం చేసిన ఎస్టిమేట్‌కు నేటి ధరలకు పనులు చేయలేనని సంబంధిత కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో రీ ఎస్టిమేషన్‌లో సుమారు రూ.15 కోట్ల నుంచి రూ.16 కోట్లు వరకు అవసరమని అధికారులు గతంలో అంచనాకు వచ్చారు.

పనులు పూర్తయితే..

ఫీడర్ ఛానల్ పనులు పూర్తయితే గుర్రంపోడ్, చండూరు, నాంపల్లి మడలాలకు చెందిన సుమారుగా 3వేల పై చిలుకు బీడు భూములు సాగులోకి రానున్నాయి. మూడు పెద్ద చెరువులు, 5 కుంటలు నిండనున్నాయి. ఇదే కాకుండా ఈప్రాంతంలో భూగర్భ జలాలు కూడా పెరగనున్నాయి.

నిధులు పెంచాల్సిందే....

13 ఏళ్ల క్రితం ఎస్టిమేషన్ రూ.4.50 కోట్లు కాగా, నేడు కాల్వ పనులకు భారీగా నిధులు పెంచాల్సి వస్తుంది. ఇప్పటికే ఆగిన కాల్వ పనులను ఐబీ అధికారులు ఇటీవల పరిశీలించారు. ఫీడర్ ఛానల్ పనులు, కాల్వ పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

కాల్వ పనులను పరిశీలించాం

శేషిలేటి వాగు ఫీడర్ ఛానల్ పనులను గతంలో ఓసారి పరిశీలించాం. గతంలో చేసిన పనులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాల్వ పరిస్థితిపై సీఈకి నివేదిక అందించాం. ఉన్నతాధికారులు ఆదేశిస్తే రీ ఎస్టిమేషన్ వేస్తాం. పాత కాంట్రాక్టరు పనులు చేయనని రాత పూర్వకంగా ఇచ్చారు.

–ఖాసీం, డీఈ, ఐబీ

ఘనంగా అయ్యప్ప నగర సంకీర్తన



నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వీధుల్లో నగర సంకీర్తన చేస్తున్న అయ్యప్ప భక్తులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మండలపూజ మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ బెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కట్ట రఘుపతిచార్యులు అర్చక బృందం వేదమంత్రాలతో మొదట గణపతి హోమం నిర్వహించి గ్రామ బొడ్రాయి నుంచి పంచ వాయిద్యాలతో ఊరేగింపుగా నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని దాసరిగూడెం గ్రామానికి చెందిన పోలగోని నాగరాజు–నీరజ దంపతులు అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నడింపల్లి శ్రీహరి, మట్టిపల్లి యాదగిరి, గడ్డం శివరాం, పుల్లెంల శ్రీనివాస్, తమిల్ శ్రీను, పర్రెపాటి గోపాల్, సైదులు, రాపర్తి మోహన్, వీసం బాలరాజు, రాపర్తి మధు, మరం సత్తిరెడ్డి, నర్సింహ, స్వామి, పోతగాని వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మండల పూజా మహోత్సవం



నల్లగొండ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న మోహన్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని కలెక్టరేట్ వద్ద గల శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం మండల పూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండల పూజా మహోత్సవానికి అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పాశం సంపత్ రెడ్డి, కోమటిరెడ్డి పృథ్వీధర్‌రెడ్డి, పోలె జయకుమార్, నాగేశ్వరరావు, గురుస్వామి రాంపాటి శ్రీనివాస్, ఆలయ అర్చకులు శ్రవణ్ కుమార్ శర్మ, సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



చిట్యాల : ఎమ్మెల్యే వీరేశానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వెలిమినేడు సర్పంచ్ మల్లమ్మ

చిట్యాల: వెలిమినేడు గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆ గ్రామ సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కోరారు. నకిరేకల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన వేముల వీరేశాన్ని బుధవారం ఆమె కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఆమె వెంట దేశబోయిన లింగస్వామి తదితరులు ఉన్నారు. అదేవిధంగా చిట్యాల పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు జిట్ట భిక్షం, పిల్లి భిక్షం, పాల యాదయ్య, జిట్ట దుర్గేష్, జీడిమెట్ల రాజు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే వీరేశానికి ఆర్టీసీ ఉద్యోగుల వినతి

నార్కట్‌పల్లి : స్థానిక ఆర్టీసీ డిపోకు బస్సుల సంఖ్య పెంచి పూర్వ వైభవం తీసుకురావాలని కోరుతూ బుధవారం నార్కట్‌పల్లి డిపోలో పని చేస్తున్న కార్మికులు ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని నకిరేకల్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రవేశపెట్టడంతో ప్రయాణికుల సంఖ్య పెరిగినట్లు వివరించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేదని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే.. త్వరలో సంబంధిత అధికారులతో చర్చించి బస్సుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నడింపల్లి మల్లేషం, బోయపల్లి భూషన్, ఐతరాజు వెంకన్న, చిట్యాల రవి, నరసింహ, జంగయ్య, నాగచారి, వీరయ్య, ఎం ఎం రెడ్డి, కుమార్, కొండ వెంకన్న, పరమేష్, ఇజ్రాయిల్, ఆర్. శేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటయ్యేనా !

- గుడివాడ శివారులో స్థలం గుర్తింపు
- నాలుగు నెలల క్రితం శంకుస్థాపన
- నేటికీ ప్రారంభం కాని పనులు



గుడివాడ శివారులో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం గుర్తించిన స్థలం

కేతేపల్లి: విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో కేతేపల్లి మండలంలోని రైతులు, వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. శంకుస్థాపన చేసి నాలుగు నెలలు గడిచినా సబ్‌స్టేషన్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో లో ఓల్టేజీ సమస్యతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కేతేపల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నలభై ఏళ్ల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా మండలంలో మూడు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మండలానికి నూతనంగా ఒక్క సబ్‌స్టేషన్ కూడా మంజూరు కాలేదు. కాలక్రమేనా మండలంలో గృహ వినియోగదారులు, వ్యవసాయ బావులు, బోరు పంపుసెట్లు, పరిశ్రమలు, వాణిజ్య దుకాణాలు భారీగా పెరిగాయి. పెరిగిన విద్యుత్ అవసరాలకు అణుగుణంగా నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కాకపోవడంతో లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నాలుగు నెలల క్రితం శంకుస్థాపన

విద్యుత్ లో ఓల్టేజీ సమస్య నివారణకు గుడివాడ శివారులో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఆరు నెలల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2.61 కోట్ల నిధులు మంజూరు చేసింది. మూసీ కుడి ప్రధాన కాల్వ వెంట సేకరించిన రెండెకరాల స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆగస్టు నెలలో అప్పటి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శంకుస్థాపన చేశారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయినట్లయితే కొత్తపేట, గుడివాడ, ఇప్పలగూడెం, కాసనగోడు, బొప్పారం గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య తీరనుంది. దీంతోపాటు కేతేపల్లిలోని సబ్‌స్టేషన్‌పై ఓవర్‌లోడ్ భారం తప్పనుంది. అయితే సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన తర్వాత నాలుగు నెలల నుంచి ఎలాంటి పనులు చేయకపోవడంతో టెండర్లు అయ్యాయా లేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఒక్క సబ్‌స్టేషన్ కింద పది గ్రామాలు

కేతేపల్లి మండలంలోని కేతేపల్లి, చీకటిగూడెం, ఉప్పలపహాడ్, కొత్తపేట, గుడివాడ, కాసనగోడు, బొప్పారం ఇప్పలగూడెం, కొర్లపహాడ్, ఇనుపాముల గ్రామాలకు కలిపి ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్ కేతేపల్లిలో ఉంది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ బావులు, బోర్లు, పరిశ్రమలు, గృహ విద్యుత్ కనెక్షన్‌లు భారీగా ఉండడంతో సబ్‌స్టేషన్‌పై ఓవర్ లోడ్ పడి విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం కలుగుతోంది. ఇనుపాముల, కొర్లపహాడ్ ఫీడర్‌లు సబ్‌స్టేషన్ నుంచి 15 కి.మీ. దూరం ఉండడంతో చివరన ఉన్న గ్రామాల్లో లూజ్‌లైన్లతో తరచూ ట్రిప్ అవుతోంది. ఎన్నికల కోడ్ ముగిసినందున ఇప్పటికైనా సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించాలని ఆయా గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలి



ఎన్నో ఏళ్ల నుంచి విద్యుత్ లో ఓల్టేజీ సమస్య ఎదుర్కొంటున్నాం. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయినట్లయితే లో ఓల్టేజీ సమస్య ఉండదు. రైతులు, వినియోగదారుల కష్టాలు తీరనున్నాయి. త్వరితగతిన పనులు ప్రారంభించి లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలి.

–కట్ట శ్రవణ్, సర్పంచ్, గుడివాడ

శంకుస్థాపన చేసి వదిలేశారు



కేతేపల్లి మండలంలో 16 గ్రామాలకు మూడు సబ్‌స్టేషన్లు మాత్రమే ఉన్నాయి. రైతులు, ప్రజలు విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. గుడివాడ వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించాలి.

–ఎస్‌కే.లతీఫ్, మాజీ సర్పంచి, గుడివాడ

ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలి

సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ చేయడంలో ఆలస్యం జరిగింది. ఇదే సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు ప్రారంభించేందుకు వీలు కాలేదు. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తేనే పనులు ప్రారంభించే వీలుంది. దీనిపై జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

–బాల్‌రెడ్డి, కన్‌స్ట్రక్షన్ ఏఈ

సబ్జెక్టుపై అవగాహన ఉండాలి



మర్రిగూడ: శిక్షణ ఇస్తున్న ఎంఈఓ గురువారావు

మర్రిగూడ: ఉపాధ్యాయులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులపై అవగాహన ఉండాలని ఎంఈఓ గురువారావు అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. మర్రిగూడ కాంప్లెక్స్ హెచ్ఎం నీరుడు అంజయ్య, నోడల్ అధికారి శ్రీనివాస్, హెచ్ఎంలు కోరె లింగయ్య, ఆర్పీలు రజనీకాంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ గురువారావు అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చింతపల్లి, మర్రిగూడెం, గట్టుప్పల్,నాంపల్లి మండలకు సంబంధించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కె సంజీవరావు, బి దామోదరాచారి, కత్తి కృష్ణారెడ్డి, కామనబోయిన శ్రీను, నాగేశ్వర్‌రావు, సాగర్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

మునుగోడు: తమ న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని కోరుతూ మునుగోడు మండలంలోని తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె రెండోరోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా సిబ్బంది తమ విధులు బహిష్కరించి మునుగోడులోని కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. గతంలో తమకు ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు తమ సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, బి.నగేష్, జి. అరుణ, యాదగిరి, దుర్గాభవాని, బి.యాదయ్య, యూసుఫ్, దివ్య, రాధ, అనిత, గణేశ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టరూ..



నల్లగొండ పట్టణంలోని డీవీకే రోడ్డులో గల అబ్బాసియా కాలనీ అన్వయ ఆస్పత్రి వద్ద తాగు నీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతోంది. 15 రోజులుగా నీరు ప్రధాన రోడ్డుపై పారుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. –నల్లగొండ టూటౌన్

నిరుపయోగంగా రైతు బజార్

నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్‌లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్ ప్రారంభించినప్పటికీ రైతులకు స్థలాలు కేటాయించలేదు. దీంతో వివిధ గ్రామాల నుంచి కూరగాయలు తెచ్చిన రైతులు రోడ్డు పక్కన ఉన్న ఫుట్‌పాత్‌పై అమ్మకాలు జరుపుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ



నిరుపయోగంగా ఉన్న రైతు బజార్



ఫుట్‌పాత్‌పై కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

లక్కారం వరద కాల్వను పూడ్చొద్దని వినతి

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులోని తెప్పలచెరువు నుంచి లక్కారం గ్రామ ఊర చెరువులోకి ఉన్న వరద కాల్వ ను పూడ్చొద్దని కోరుతూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా చైర్మన్ పాశం సంజయ్‌బాబు, చౌటుప్పల్ మున్సిపాలిటీ 08వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ సైదులుగౌడ్ బుధవారం ఆర్డీఓ, ఐబీ డీఈ, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాశం రఘుపతి, గుండెబోయిన ఐలయ్య, పాశం శ్రీనివాస్ , మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ధర్నా

దేవరకొండ: ఆటో కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తోందని బుధవారం దేవరకొండ పట్టణంలో ఆటో కార్మికులు, డ్రైవర్లు బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పించడంపై పునరాలోచించాలని కోరారు. నేడు ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జానిబాబా, జానయ్య, నగేష్, రమేష్, మల్లయ్య, జాని, యాదగిరి, చంద్రు, సుక్యానాయక్ తదితరులున్నారు.

మాజీ జెడ్పీటీసీ కుమారుడు అనారోగ్యంతో మృతి

మర్రిగూడ: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ పిట్టల ఎట్టయ్య ద్వితీయ కుమారుడు పిట్టల ఇంద్రయ్య అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్ రావు, పల్లా నర్సింహారెడ్డి, మండల సహాయ కార్యదర్శి బూడిద సురేష్, కల్లెం యాదగిరిరెడ్డి, చెల్లం పాండురంగారావు, ఆకుల రఘుమయ్య, ఈద మారయ్య, ఆకుల వెంకట్రామ్, బడేటి పెద్దయ్య, వడ్డెమాన్ వెంకటయ్య, కొన్‌రెడ్డి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

మర్రిగూడ: రాష్ట్రంలోని దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర కృష్ణగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల రిజర్వేషన్‌ను మూడు నుంచి ఐదు శాతం పెంచి పెన్షన్‌ను రూ.6వేలు అందించాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న దివ్యాంగులకు రూ.లక్ష ప్రోత్సాహకం అందించాలని కోరారు. దివ్యాంగురాలైన రజిని అనే మహిళకు సీఎం రేవంత్‌రెడ్డి తొలి ఉద్యోగ అవకాశాన్ని కల్పించడం ఆనందదాయకమన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట జిల్లా నర్సింహగౌడ్, శ్రీనివాస్, రాములు తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గిరిజన గురుకుల పాఠశాలను ఎంపీపీ గుత్త ఉమాదేవి బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ప్రేమ్‌చందర్‌రెడ్డి, సతీష్ తదితరులు ఉన్నారు.